క్లుప్తంగా

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

రుద్రవరం: పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావణి అన్నారు. మండల పరిధిలోని చిన్నకంబలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవంలో భాగంగా మంగళవారం తక్కువ ఖర్చుతో మంచి పోషక విలువలున్న వాటితో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారిణి అక్కడికొచ్చిన గర్భిణులు, బాలింతలకు ఫుడ్ కోర్టులో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, వాటిలో లభించే పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి కళావతి తదితరులు ఉన్నారు.

గొర్రెల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆన్‌లైన్ విధానాన్ని వివరిస్తున్న డీడీ

రుద్రవరం: గొర్రెలు, మేకలకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ డీడీ రమణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఆలమూరు పశు వైద్యశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. జీవాలకు వేసిన టీకాల వివరాలను అక్కడి వైద్యురాలు లక్ష్మీ ప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 40 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని, త్వరితగతిన వాటికి పారుడు వ్యాధి సోకుండా నివారించేందుకు టీకాలు వేసి ఆన్ లైన్ చేయాలని సూచించారు. టీఎంఆర్ దాణా అందుబాటులో ఉందని, అలాగే గడ్డి కత్తిరించే యంత్రాలు ఉన్నాయని 50శాతం రాయితీలో అందిస్తామని రైతులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఏడీ గిడ్డయ్య ఉన్నారు.

స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దాదాపీర్

చాగలమర్రి: ముస్లిం మైనారిటీ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముల్లా దాదాపీర్ ఎన్నికై నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అహ్మద్‌బాషా మంగళవారం తెలిపారు. గత నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సంఘం ఎన్నికల్లో షేక్.యిస్మాయిల్‌ఖాద్రి ప్యానెల్, ఎస్.కె.ఖలీల్ అహ్మద్ ప్యానెల్ పోటీ పడగా 650 ఓట్ల మెజారిటీతో షేక్.యిస్మాయిల్ ఖాద్రి ప్యానెల్ గెలుపొందిందన్నారు. ఈ ప్యానెల్‌లో చాగలమర్రికి చెందిన ముల్లా దాదాపీర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జమాల్, సాదఖ్ సహాయ కార్యదర్శులుగా, మహబుబ్‌బాషా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. ఎన్నికలలో గెలుపొందిన ప్యానెల్ సభ్యులు ఆదివారం నెల్లూరు పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎన్ గ్రాండ్ కన్వేన్షన్ హాలులో ప్రమాణస్వీకారం చేసినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణంలోని సాదిక్ నగర్, సాయిబాబ నగర్, నూనెపల్లె హరిజనవాడ సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయానికి వచ్చే లబ్ధిదారులతో సున్నితంగా వ్యవహరించాలన్నారు. ప్రతి సచివాలయంలో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం


ఉచిత విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎల్‌ఐ

దొర్నిపాడు: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఎల్‌ఐ అయ్యన్న సూచించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో 200 యూనిట్ల విద్యుత్ వినియోగం పై అవగాహన కల్పించారు. 200 యూనిట్లు దాటితే మాత్రం మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావునా విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఎస్సీఎస్టీలకు అవగాహన కల్పించారు. మండలంలో రూ.22లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని విడతల వారీగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరెడ్డి, నాగన్న, గోపాల్‌రెడ్డి, నాగయ్య, సురేంద్ర, మనోహర్, విశ్వనాథ్‌రెడ్డి, వంశీ, పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు

- తెలుగుగంగ కింద బోర్ల పరిధిలో అధికంగా వరి పంట సాగు
- కేసీ కెనాల్ కింద ఇప్పటికే నాట్లు పూర్తి
- సాధారణ సాగు విస్తీర్ణం 6,500 హెక్టార్లు
- మొత్తం 4,170 హెక్టార్లలో పంట సాగు
- మిగిలిన భూముల్లో ఆరుతడి పంటలకు రైతుల మొగ్గు


ఎద్దులతో పండ్ల మాను తోలుతున్న దృశ్యం


వరి నారు తీస్తున్న కూలీలు


నాట్లు వేస్తున్న మహిళలు


బోరు కింద వరి పంట సాగు చేసిన దృశ్యం

శిరివెళ్ల: మండలంలో ఖరీఫ్‌లో భాగంగా బావులు, బోర్లు కింద ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఎప్పటి లాగే కేసీ కెనాల్, తెలుగుగంగ కింద వరి సాగుకు అవసరమైన వరినారు పోసుకున్నారు. నారు ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి వచ్చింది. దీంతో రైతులు బోర్లు, బావులు కింద నాట్లు ప్రారంభించారు. కోటపాడు, వీరారెడ్డిపల్లె, కామినేనిపల్లె, గోవిందపల్లె, వెంకటాపురంలో బోర్లు అధికంగా ఉన్నాయి. రెండు ఎకరాలున్న రైతు కూడా గతంలో బోరు వేయించుకున్నారు. దీంతో సాగు నీటికి ఇబ్బంది లేక పోయింది. అయితే సెప్టెంబర్ ఆరంభంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు రైతులకు కలిసొచ్చాయి. దీంతో ఆయా గ్రామాల్లో నీటి సౌకర్యం లేని రైతులు కూడా వరినాట్లు వేస్తున్నారు. కేసీ కెనాల్‌లో 16వ లాక్ వద్ద 4 అడుగుల మేర నీరు ఉండడం, ఆ నీటిని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె సబ్ చానల్‌కు నీరు వదలండంతో కేసీపరిధిలోని రైతులు నాట్లు వేస్తున్నారు.

తెలుగు గంగ కింద మెట్ట పంటలే..

కేసీ కెనాల్ రైతులు వరి నాట్లల్లో బిజీగా ఉన్నారు. ఇక తెలుగుగంగ ఆయకట్టు కింద బోర్లు, బావులు ఉన్న రైతులు మాత్రమే వరి నాట్లు వేస్తున్నారు. చెన్నూరు, బోయలకుంట్ల, ఇసుకపల్లె, మోత్కలపల్లె, మహదేవపురంలో నీటి వనరులు లేని రైతులు ఆరుతడి, మెట్ట పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఈ నెలాఖరు నుంచి అక్టోబర్ మొదటి వారంలో మినుము, జొన్న పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు.

కొనసాగుతున్న నాట్లు..

మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 6,500 హెక్టార్లు. ప్రస్తుతం తెలుగు గంగ కింద బోర్ల పరిధిలో 2,350 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు. కేసీ కెనాల్ కింద 1,820 హెక్టార్లలో ఇప్పటికే ఇప్పటికే నాట్లు పూర్తి చేశారు. మిగిలిన విస్తీర్ణంలో తెలుగుగంగ కింద ఆరుతడి పంటలుగా మినుము, జొన్న పంటలు సాగు చేయాలని రైతులు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు.

వర్షపాతం ఇలా..

నెలల వారీగా మండలంలో వర్షపాతం ఇలా..

నెల	కురవాల్సింది	కురిసింది
మే	44.03 మీ.మీ	55.04
జూన్	94.33	28.02
జూలై	176.06	197.06
ఆగస్టు	166.09	44మీ.మీ

పాఠశాలలను విధిగా విజిట్ చేయాలి

దొర్నిపాడు: సచివాలయ ఉద్యోగులు విధిగా ఆయా పాఠశాలలను విజిట్ చేయాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎఈఓలు అబ్దుల్ కరీం, రామచంద్రయ్య సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అమలుపై పరిశీలించాలన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన స్నేహితా ఫౌండేషన్ చైర్మన్ సురేంద్రానాథ్‌రెడ్డి మంగళవారం ఓ పేద విద్యార్థికి ఆర్థిక సహాయం చేశారు. నంద్యాల సర్వజ్ఞ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న నాగతేజకు చదువు నిమిత్తం రూ.12 వేలు ఆర్థిక సహాయం చేశారు. ప్రతిభ గల పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు.

రీసర్వేను సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించే రీసర్వేను సక్రమంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడత రీసర్వేలో భాగంగా తేళ్లపురి, జిల్లెల్ల గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రామచంద్రారవు, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారం


ఆహా క్యాంటిన్ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆళ్లగడ్డ : పేదలకు తక్కువ ధరకు రుచికరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆహా క్యాంటిన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం పట్టణ పేదరిక నిర్మూల సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులకు తక్కువ ధరకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు, కూలీలకు, కార్మికులకు ఆహా క్యాంటిన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హరినాథరావు, రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రఘునాథరెడ్డి ఉన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభించిన ప్రముఖులు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్‌ఎం కోటయ్య, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఉపసర్పంచ్ మహమ్మద్ సోహెల్ ప్రారంభించారు. ఈ పోటీలలో మండలానికి చెందిన 10 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్- 14,17 విభాగాల్లో కబడ్డి, కోకో, వాలిబాల్, త్రోబాల్, అథేలెటిక్స్‌లతో పాటు 9 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు ముల్లా దాదాపీర్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు బురాందీన్, షేక్షావలి, పీఎంసీ చైర్మన్ కె.అబ్దుల్లా, సిద్దిఖ్, పీఈటీలు ఎంఏపీ సుమన్, కె.శ్రీనాథ్‌రెడ్డి, జి.ఆశాజ్యోతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

రేపు శిరివెళ్లలో..

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శంకరప్రసాద్ మంగళవారం తెలిపారు. అండర్ 14, 17 విభాగాలలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్‌బాడ్మింటన్ వాలీబాల్, షటిల్ బ్యాట్మిమెంట్ టెన్నికాయట్, యోగా వంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. ఎంఈఓ -2 నాగార్జునరెడ్డి, హెచ్‌ఎం వరాహమయ్య, క్రీడల సమన్వయకర్త విజయకుమార్ పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంపీపీ బాలస్వామి, పీఎంసీ చైర్మన్ లింగం బ్రహ్మయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ప్రారంభించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం కూడా పోటీలు కొనసాగుతాయని హెచ్‌ఎం సుబ్బరాయుడు తెలిపారు.

ఉయ్యాలవాడ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈఓ అనురాధ అన్నారు. మంగళవారం మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రతాప్‌రెడ్డి, పీఈటీలు నరసింహుడు, బుచ్చిబాబు, దాసు, కళావతి, హెచ్‌ఎం నరసింహుడు పాల్గొన్నారు.

పర్మిట్ లేకుండా బస్సులు నడిపితే జరిమానా

నంద్యాల(న్యూటౌన్): పర్మిట్ (రోడ్ ట్యాక్స్) రికార్డులు లేకుండా ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు నడిపితే జరిమానాతో పాటు సీజ్ చేస్తామని నంద్యాల రవాణా శాఖ అధికారి శివారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నంద్యాల-కోవెలకుంట్ల రహదారిలో తనిఖీలు చేపట్టారు. రికార్డులు సరిగా లేని ఓ పాఠశాల బస్సుకు రూ.10వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఎంవీఐలు తిమ్మరుసునాయుడు, శ్రీకాంత్, రవిశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

గోస్పాడు: మండల స్థాయి క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ-2 సురేంద్రనాథ్ సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం పీడీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, పీడీలు విశ్వనాథ్, నాగేశ్వ, నాగలక్ష్మి, గీతా, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణ హోమాన్ని ఖండించాల్సిందే

నంద్యాల(న్యూటౌన్): ఎంతో మంది మాణ ప్రాణాలను బలిగొన్న మణిపూర్ మారణ హోమాన్ని అందరూ ఖండించాల్సిందేనని పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో జిల్లా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మణిపూర్ హింసా కాండ-ఉమ్మడి పౌర స్మృతి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మతాల, కులాల తెగల ప్రాంతాల పేరుతో మణిపూర్ రాష్ట్రం తగలబడిపోతుంటే దేశం వెలిగిపోతుందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తూ వాస్తవాలను పాతిపెట్టేస్తున్నారన్నారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు రామరాజు, లక్ష్మణ్, పుల్లా నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్యులు పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐఎంఎల్ ఆర్‌ఐ పార్టీ జిల్లా కార్యదర్శి రవిరాజు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే పేదలకు రాత్రి వేళల్లో వైద్య సదుపాయాలు సక్రమంగా అందించాలన్నారు. కొంత మంది విధుల సమయంలో పేషెంట్లను పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల గోస్పాడు మండలంలోని కస్తూరిబా పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రికి వస్తే వైద్య సేవలు ఇవ్వడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో కలాంబాషా, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఖాళీలు భర్తీ చేయాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఈసీఈఏ-3045 జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. జిల్లాలోని బిలకలగూడూరు 220కేవీ సబ్‌స్టేషన్‌లో ముగ్గురు, 132/33 కేవీ 55 ఆళ్లగడ్డ సబ్‌స్టేషన్‌లో ముగ్గురు మాత్రమే గత మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు అదనపు విధులతో ఇబ్బందులు పడుతున్నారంటూ మంగళవారం ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మధు, ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలకు గురి కావద్దు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఆర్థిక పథకాలకు అర్హత సాధించే సందర్భాల్లో మోసాలకు గురి కావద్దని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు సూచించారు. స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటీఎం, ఆధార్, పిన్, ఓటీపీ నెంబర్లను ఎవరికి ఇవ్వవద్దని సూచించారు.

పాత పెన్షన్ విధానం సాధనకు భారత యాత్ర

నంద్యాల(న్యూటౌన్): పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయాలనే నినాదంతో భారత యాత్ర చేపట్టినట్లు ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ భారత యాత్ర కన్యాకుమారి నుంచి ప్రారంభమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనికి ఈ నెల 15న చిత్తూరు జిల్లాలోనికి ప్రవేశిస్తుందన్నారు, 16న అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ వీరభద్రుడు మంగళవారం పరిశీలించారు. మెనూ ప్రకారం వండిన పులిహోర, ఆహర పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పథకాలను అందజేస్తోందన్నారు. పాఠశాలలో నాడు-నేడు పథకం కింద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, పీఎంసీ చైర్మన్ అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ముత్యాలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం


కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం మలు చేస్తున్న జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేసి వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలకంటే ఎక్కువ పథకాలను అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. ప్రజలేవ్వరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అన్ని రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అప్పటికప్పుడే ఉచితంగా ఆందజేయడం జరిగిందన్నారు. అలాగే ప్రజలందరి ఆరోగ్యం కోసం ఆహర్నిశలు ఆలోచించి ఈ నెల 15 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నూతన పింఛన్ల పంపిణీ

చాగలమర్రి మండలానికి 387 జగనన్న సంక్షేమ పెన్షన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముత్యాలపాడు సచివాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, సర్పంచ్ శంకరమ్మబాయి, ఉపసర్పంచ్‌లు మహమ్మద్ సోహెల్, ఓబులేసు, ఎంపీటీసీలు పత్తి నారాయణ, కె.లక్ష్మీరెడ్డి, జిల్లా సెవాదళ్ అధ్యక్షుడు గణేశ్‌రెడ్డి, రహమాన్, చంద్‌బాషా, దస్తగిరి, సుబ్బరాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


మండలస్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

దొర్నిపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రూ.1.72కోట్లతో నిర్మిస్తున్న 8 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు తుది దశకు వచ్చాయని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరుతుందని చెప్పారు. అనంతరం మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు.

వెంటనే ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి..

పాఠశాల తనిఖీ అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. బ్లాక్‌బోర్డుల స్థానాల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్)కు ఇంకా ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించక పోవడంపై మండిపడ్డారు. వెంటనే ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చి ప్యానెల్స్‌పై విద్యాబోధన సాగించాలని ఆదేశించారు. వీటి వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ డీ ఈశ్వరయ్య, ఏఈ శంకరయ్య, ఎంఈఓలు అబ్దుల్ కరీం, రామచంద్రయ్య, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీలు దేవేంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలు రైతులకు లాభదాయకం


మాట్లాడుతున్న ఏపీజీబీ రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్

ఉయ్యాలవాడ: గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకోవడం రైతులకు లాభదాయకంగా ఉంటుందని నవయుగ ఏజెన్సీ డైరెక్టర్ నరసింహుడు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం కూరగాయల మార్కెట్‌లో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మార్కెటింగ్ కలెక్షన్ సెంటర్‌లో రేనాటి సూర్యచంద్రుల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సంఘం పరిధిలో ఉన్న 500 మంది రైతులకు ఎలాంటి షూరిటీ లేకుండా తమ శాఖ తరుపున రూ. 50 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని రీజినల్ మేనేజర్ తెలిపారు. ఉయ్యాలవాడలో ఇప్పటి వరకు రూ. 25 కోట్ల రుణాలు రైతులకు అందజేశామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో బ్యాంకులకు చెల్లిస్తే ప్రభుత్వం కల్పిస్తున్న వడ్డీ మాఫీ వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాదాకృష్ణారెడ్డి, ఉద్యాన శాఖాధికారిణి ధరిణి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

నంద్యాల(సిటీ): పట్టణంలోని వార్డు సచివాలయాల్లో మంగళవారం మంజూరైన నూతన పింఛన్లను అర్హులకు సంబంధిత వార్డు కౌన్సిలర్లు, వార్డు అడ్మిన్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పట్టణంలోని 40 వార్డులలో 510 కొత్త పింఛన్లకు గాను రూ.14,12,500లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం


వార్డులో పర్యటిస్తున్న చైర్ పర్సన్

నంద్యాల(సిటీ): పట్టణంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. మంగళవారం 5వ వార్డులోని నడిగడ్డ-2వ ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. వాటిని సత్వరమే పరిష్కరిస్తారని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డులో శానిటేషన్ పూర్తిగా మెరుగవ్వాలని, కాల్వలలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వార్డులో వీధి దీపాలు, కచ్చా డ్రైన్ల నిర్వహణ లోపం ఉండకూడదన్నారు. కౌన్సిలర్ ఆరిఫ్ మహమ్మద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈలు మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

నంద్యాలటౌన్: నంద్యాల జిల్లా పరిధిలోని ఆత్మకూరు, నందికొట్కూరు ఆర్టీసీ డిపోల్లో ఖాళీ స్థలములో వ్యాపార సముదాయాలు నిర్వహించుకోవడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ పరిధిలో 242 చదరపు గజాల ఖాళీ స్థలము, నందికొట్కూరు బస్టాండ్ పరిధిలో 6287 చదరపు గజాల ఖాళీ స్థలమును 15 సంవత్సరాలు వ్యాపారం నిర్వహించుకోవడానికి ఆసక్తిగల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. టెండర్లు వేయదలచిన వారు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కడప కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య బిడ్ సమర్పించవచ్చని తెలిపారు. ఈ టెండర్లకు సంబంధించి 15న ఆత్మకూరు, 16న నందికొట్కూరు డిపోలలో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్ చూడవలసినదిగా సూచించారు.

రేపు డయల్ యువర్ డీపీటీఓ

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి, సమస్యల పరిష్కారానికి గురువారం డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలను సెల్ నెం. 99592 24885కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పటిష్ట బందోబస్తు
- అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఈ నెల 22న శాంతియుత వాతావరణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పోలీస్ యంత్రాంగాన్ని, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో మొదటి కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు, సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పరస్పర సహకారంతో నిమజ్జన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో దాదాపు 320 విగ్రహాలు నిమజ్జనం కానున్నట్లు కమిటీ సభ్యులు సూచిస్తున్నారని, ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రధానంగా గణేష్ విగ్రహాలు ప్రయాణించే రోడ్డు మార్గాల్లో విద్యుత్ తీగల సర్దుబాటు, రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. చిన్న చెరువు, కుందూ నది సమీపంలో పుట్టీలతో పాటు అవసరమైన స్విమ్మర్లను, లైఫ్ జాకెట్, రోప్స్ తదితర మెటీరియల్‌తో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అగ్నిమాపక, మత్స్యాశాఖ అధికారులను ఆదేశించారు.

రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ విగ్రహాల ఊరేగింపు

జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ విగ్రహాల ఊరేగింపునకు పకడ్బందీ ప్రణాళికతో పాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పోలీస్ యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసు శాఖకు సహకరించి గణేష్ నిమజ్జోత్సవం పూర్తయ్యేంతవరకు కార్యకర్తలు సహకరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, కార్యాధ్యక్షులు వైద్యం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నెరవాటి అమర్నాథ్, చలంబాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై పకడ్బందీ ప్రణాళిక రూపొందించండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో రోగులకు వైద్య సేవలు అందించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి, హెల్త్ క్యాంపులకు సంబంధించిన వివరాలు వారికి తెలియజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, మలేరియా అధికారి నరహరి, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.